క్లుప్తంగా

ఆట, పాటలతో అలరించిన విద్యార్థులు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతుంది. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు అంశాలపై బోధించారు. విజ్ఞానం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. పొడుపు కథలు చెప్పించారు. పిల్లలకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఆటా పాట కార్యక్రమంలో భాగంగా పిల్లలతో డ్యాన్సులు వేయించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది బీడీసీ మల్లిక, సత్యావతి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో దూడ మృతి

నందిగామ: వీధి కుక్కల బారిన పడి దూడ మృతి చెందిన ఘటన పట్టణ శివారు అనాసాగరం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. అనాసాగరంలో సీహెచ్ కృష్ణకు చెందిన ఏడు నెలల గేదె దూడను రోజు మాదిరిగానే ఇంటి ఆవరణలో కట్టేశారు. అర్ధరాత్రి సమయంలో దూడపై వీధి కుక్కలు దాడి చేశాయి. సోమవారం ఉదయం నిద్రలేచి చూడగా దూడ మృతి చెంది ఉండడాన్ని గమనించారు. గతంలో కూడా వీధి కుక్కలు ఇలానే దాడి చేశాయని కృష్ణ ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామని బాధితుడు తెలిపారు.

వరి పంట దిగుబడిపై అంచనా

నందిగామ: మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలో రబీ పంటగా వరి సాగు చేసిన పొలాల్లో సోమవారం ఆర్‌బీకే సిబ్బంది దిగుబడి అంచనా వేశారు. గ్రామంలోని ఎం.అజయ్ కుమార్ పొలంలో 5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అంచనా వేయగా 25.08 కిలోల ధాన్యం దిగుబడి వచ్చిందని గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్ మస్తాన్ తెలిపారు. దీనిని బట్టి ఎకరాకు సుమారు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని నెహ్రూచౌక్ ప్రాంతంలో మదన్ బేకరీ పక్కన ఉన్న ఓ రెడీమేడ్ వస్త్రదుకాణంలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో షాపులో సుమారు రూ.50 వేల నుంచి రూ.లక్ష లోపు విలువైన బట్టలు, సామగ్రి దగ్ధం అయ్యాయి. షాపు యజమానులు స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఆఫీసర్ తోట మురళీ కృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపుచేశారు. ప్రమాద తీవ్రత లేకుండా నివారించారు.

మామిడి కాయల ముక్కలతో ఉపాధి



నందిగామ: ఆవకాయ సీజన్ పుణ్యమాని కొందరు కార్మికులకు జీవనోపాధి దొరుకుతోంది. ప్రస్తుతం మామిడికాయల సీజన్ నేపథ్యంలో పట్టణంలో అనేకమంది కార్మికులకు జీవనోపాధి లభిస్తోంది. మామిడి కాయల ముక్కలు కొట్టే పనితో ఆర్థిక వెసలుబాటు కల్పించుకుంటున్నారు కొందరు. మామిడి కాయల సీజన్ వచ్చిందంటే ఆవకాయ పచ్చడి పట్టే పనిలో నిమగ్నమవుతారు చాలా మంది. ఇది కొంత మేర ప్రయాసతో కూడుకున్న పనే. కాయలు కొనడం, నానబెట్టడం వరకు తేలికపాటి పనులే.. అయినప్పటికీ, ముక్కలు కొట్టడం ఓ పెద్ద ప్రహసనం. ముక్క ఎంత మాత్రం చెదరకుండా ఎంతో జాగ్రత్తగా ముక్కలు కొడితే తప్ప పచ్చడికి ఉపయోగపడదు.

పూర్వం ప్రతి ఇంట్లో ఆవకాయ పచ్చడి పట్టేందుకు అవసరమైన అన్ని పనులు కుటుంబసభ్యులంతా కలసి స్వయంగా చేసుకునే వారు. ఆవకాయ రుచి ముందు కష్టమంతా మరచిపోయే వారు. అయితే, ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఎవరికీ అంత సమయం లేదు. దీంతో రెడీమేడ్ పచ్చళ్ల హవా ఆరంభమైంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా పచ్చడి పట్టి అందించే వారు సైతం మార్కెట్‌లోకి ప్రవేశించారు. మరికొందరు ముక్కలు కొట్టి సదరు పచ్చడి పట్టుకునే వారికి కొంత పనితగ్గిస్తున్నారు.

కాయ సైజునుబట్టి..

ప్రస్తుతం ఆవకాయ పచ్చడి సీజన్ నడుస్తున్న తరుణంలో ముక్క కొట్టేవారికి పనిబాగానే దొరుకుతోంది. ఒక్కో కాయకు సైజును బట్టి రూ.5 నుంచి రూ.7 వరకు వసూలు చేస్తున్నారు. వీరు పట్టణంలో ఈ ఏడాది పదుల సంఖ్యలో ఉన్నారు. ఆవకాయ సీజన్ కొందరు కార్మికులకు చేతి నిండా పనితోపాటు ఆదాయం కూడా తెచ్చిపెడుతోంది.

ప్రభుత్వ పాఠశాలల్లో చదవాలనిపించేలా..!



పెనుగంచిప్రోలు కేవీఆర్‌జెడ్పీ హైస్కూల్‌లో మూడో శ్లాబ్‌కు సిద్ధమైన భవనం

- ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ
- మండలంలో 23 పాఠశాలల్లో రూ.9 కోట్లతో పనులు
- ముమ్మరంగా రెండో విడత నాడు-నేడు పనులు

పెనుగంచిప్రోలు: ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను సమూలంగా మార్చి.. మెరుగైన వసతుల కల్పనకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మనబడి నాడు-నేడు కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలవుతోంది. ప్రతి విద్యార్థికీ కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలల స్థానంలో కొత్త పాఠశాలల నిర్మాణం, తరగతి గదులు అవసరమైన చోట అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు చేసి ఆధునిక హంగులతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారు. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరేలా తొమ్మిది రకాల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

23 పాఠశాలలకు రూ.9 కోట్లకు పైగా..

2019లో బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన నాడు-నేడు పనుల్లో భాగంగా మొదటి విడత పూర్తయింది. రెండో విడత నాడు-నేడు పనులు ముమ్మరంగా సాగుతన్నాయి. మండలంలో మొత్తం 23 పాఠశాలల్లో రూ.9 కోట్ల 69 లక్షల 71 వేల నిధులతో పనులు జరుగుతున్నాయి. పాఠశాలల వారీగా మంజూరైన నిధుల వివరాలు ఇలా ఉన్నాయి.

గ్రామాల వారీగా పాఠశాలలకు మంజూరైన నిధులు

గ్రామం	మంజూరైన నిధులు (లక్షల్లో)
ఎంపీపీఎస్ అనిగండ్లపాడు	రూ.10.99
జెడ్పీహెచ్ఎస్, అనిగండ్లపాడు	రూ.95.51
ఎంపీపీఎస్, వెల్దుర్తిపాడు	రూ.15.90
ఎంపీయూపీఎస్, గుమ్మడిదూర్రు	రూ.18.00
ఎంపీపీఎస్, కొల్లికూళ్ల	రూ.4.64
జెడ్పీహెచ్ఎస్, కొల్లికూళ్ల	రూ.68.75
జెడ్పీహెచ్ఎస్, కొణకంచి	రూ.10.98
ఎంపీపీఎస్ (హెచ్‌డబ్ల్యూ), లింగగూడెం	రూ.20.31
ఎంపీపీఎస్, లింగగూడెం	రూ.28.88
ఎంపీయూపీఎస్, ముచ్చింతాల	రూ.15.78
ఎంపీపీఎస్(మెయినన్), ముండ్లపాడు	రూ.4.17
ఎంపీపీఎస్ (హెచ్‌డబ్ల్యూ),ముండ్లపాడు	రూ.16.05
జెడ్పీహెచ్ఎస్, ముండ్లపాడు	రూ.105.98
ఎంపీపీఎస్ (టీసీ),పెనుగంచిప్రోలు	రూ.15.98
ఎంపీపీఎస్ (గరల్స్), పెనుగంచిప్రోలు	రూ.17.98
ఎంపీపీఎస్ (మెయిన్), పెనుగంచిప్రోలు	రూ.21.93
కేవీఆర్‌జెడ్పీహెచ్ఎస్, పెనుగంచిప్రోలు	రూ.207.96
ఎస్ఎస్‌పీఎంజెడ్పీహెచ్ఎస్,పెనుగంచిప్రోలు	రూ.41.83
ఎంపీపీఎస్(ఈస్ట్),పెనుగంచిప్రోలు	రూ.16.07
ఎంపీపీఎస్, వెంగనాయకునిపాలెం	రూ.4.9
జెడ్పీహెచ్ఎస్, శనగపాడు	రూ.195.12
ఎంపీయూపీఎస్, తోటచర్ల	రూ.24.00
ఎంపీపీఎస్, కె.పొన్నవరం	రూ.7.99
మొత్తం	రూ.969.71 కోట్లు

వివిధ దశల్లో నిర్మాణాలు



రెండో విడత నాడు-నేడు పనులు మండలంలో వివిధ దశల్లో జరుగుతున్నాయి. జెడ్పీ హైస్కూళ్లల్లో శ్లాబ్‌లు పూర్తవుతున్నాయి. మొత్తం 23 పాఠశాలల్లో రూ.9 కోట్లకు పైగా నిధులతో పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు నిర్వహిస్తున్నాం.

–ప్రసాద్, ఎస్ఎస్ఏ ఏఈ

అందంగా తీర్చిదిద్దుతున్నారు



నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాలలను అందంగా తీర్చి దిద్దారు. మా గ్రామంలో జెడ్పీ హైస్కూల్‌తో పాటు ప్రాథమిక పాఠశాలలు కూడా నాడు-నేడు పథకంలో సుందరంగా ముస్తాబవుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల విద్యపై అంకితభావంతో పనిచేయటం సంతోషం.

–బి.జ్యోతిబ్రహ్మం, సర్పంచి అనిగండ్లపాడు

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయ భాను అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఉదయ భాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో మిట్టగూడెంకు చెందిన పిట్టల ఈదమ్మకు అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1.20 లక్షల విలువైన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

నందిగామ: పట్టణంలోని రైతు బజార్‌లో సోమవారం మధ్యాహ్నం వినియోగదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో మధ్యాహ్నం సమయంలో రైతు బజారుకు వచ్చే వినియోగదారుల కోసం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్టేట్ అధికారి అజయ్ కుమార్ తెలిపారు. భానుడి ప్రతాపం తగ్గేంతవరకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు.

సంక్షేమ పథకాలతో కుటుంబాల్లో సంతోషం

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- నరసింహారావుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



నరసింహారావుపాలెంలో లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నరసింహారావుపాలెం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలలో వెలకట్టలేని సంతోషాన్ని నింపుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో సోమవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలు పొందిన లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేశారని గుర్తు చేశారు. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆరోగ్య శ్రీ పథకానికి పూర్వ వైభవం తెచ్చారన్నారు. రెండు వేలకు పైగా జబ్బులను ఆరోగ్య శ్రీ పథకంలో చేర్చి ఉచిత వైద్యమందిస్తున్నారని గుర్తు చేశారు. కరోనాను సైతం ఆరోగ్య శ్రీలో చేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు మంచి చేయటమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండి ఆశీర్వదించాలని జగన్‌మోహనరావు కోరారు. గడప గడపకు మన ప్రభుత్వంలో తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, మాజీ సర్పంచ్ సుభాని, పలువురు నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ



యంత్ర పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: రైతు సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సీహెచ్‌సీ గ్రూపుల రైతులకు రాయితీపై ప్రభుత్వం మంజూరు చేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ మండలంలోని అనాసాగరం, లింగాలపాడు, తదితర గ్రామాల రైతులకు రూ.16 లక్షల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాలను 40 శాతం రాయితీపై అందించామని తెలిపారు.

డీసీఎం వ్యాన్ అందజేత..

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం, ఫిష్ ఆంధ్ర పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త రాయితీపై మంజూరైన డీసీఎం వ్యాన్‌ను చందర్లపాడు మండలం ఉస్తేపల్లి గ్రామానికి చెందిన పెమ్మాడి సైదులుకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయటంతో పాటు విదేశాలకు సైతం ఎగుమతి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, నాయకులు నల్లమల్లి మురళి, పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పాకాలపాటి కిరణ్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, ఆల ప్రభు, పాకాలపాటి కిరణ్, యాకుబ్ అలీ, బండారు వెంకట్రావ్, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలి

ఎంపీపీ చెంబేటి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎంపీపీ, పక్కన ఎంపీడీఓ, ఎంఈఓ

వత్సవాయి: విద్యారంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ చెంబేటి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం హెచ్‌ఎంలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, సీఆర్‌పీలతో ఎంఈఓ లాహోరి నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నియోజకవర్గంలో మండలం ప్రథమ స్థానం రావటం అభినందనీయమన్నారు. విద్య కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ 3 నుంచి 18 సంవత్సరాలు వయస్సు ఉన్న పిల్లల సర్వే నిర్వహించి ప్రతి ఒక్కరినీ ఏదో ఒక పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్స్, వలంటీర్లపై ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు ప్రభుత్వం సీట్లు కేటాయించిందని అర్హులైన వారిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందజేయాలన్నారు.

సూర్య ప్రతాపం

నిప్పులు కక్కుతున్న భానుడు

నందిగామ: భానుడు రోజురోజుకు నిప్పులు కక్కుతున్నాడు. గత రెండు రోజులుగా నందిగామ ప్రాంతంలో పగటి ఉష్ణోగ్రతలు క్రమేపి పెరుగుతున్నాయి. ఆదివారం నందిగామలో పగటి ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీలు నమోదు కాగా సోమవారం మరింత పెరిగి 43.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 7 గంటల నుంచే భానుడి ప్రతాపానికి తోడు వడగాల్పులు వీస్తున్నాయి. అత్యవసర పనులు ఉన్నవారు మినహా ప్రధాన రహదారుల్లో ప్రజలు కనిపించడం లేదు. గత రెండు రోజులుగా రాత్రి సమయంలో కూడా వడగాల్పులు వీస్తున్నాయి. దీంతో పేద మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఇక సంపన్నులు మాత్రం ఏసీ గదులను వీడడం లేదు. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణ



అనిగండ్లపాడు (పెనుగంచిప్రోలు): గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతు న్నాయి. సోమవారం విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పారు. పుస్తక పఠనం వలన కలిగే లాభాలను వివరించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఇంజం మధు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థి హర్షితను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, చిత్రంలో తన్నీరు

జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జగ్గయ్యపేట పట్టణంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి తోకల హర్షితను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అభినందించారు. విజ్ఞాన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి తోకల హర్షిత 584/600 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. ఎమ్మెల్యే ఉదయభాను, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు హర్షితను జ్ఞాపికలతో అభినందించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యాదీవెన తదితర పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తద్వారా తల్లిదండ్రులు, పాఠశాలలు, జగ్గయ్యపేటకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి 'స్పందన' మంచి వేదిక

జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్



అర్జీ ఇచ్చేందుకు వచ్చిన మహిళతో మాట్లాడుతున్న జేసీ సంపత్ కుమార్

నందిగామ: ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన మంచి వేదికని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి సమస్యలపై అర్జీలు అందజేసేందుకు వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇప్పటికే జిల్లాలో స్పందన ద్వారా దీర్ఘకాలంగా పరిష్కారం కాని ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు.

స్పందన ద్వారా వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని స్థానిక అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమంలో 14 అర్జీలు అందాయని ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'స్పందన'లో 10 అర్జీలు స్వీకరణ

వీరులపాడు: స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్క అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుంచి ఆరు అర్జీలు అందాయన్నారు. వాటన్నింటిని పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్‌ఐ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ శంకర్‌బాబు ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సమస్యలపై నాలుగు అర్జీలు అందాయని తెలిపారు.

ఘనంగా మేరీ మాత ఆలయ మహోత్సవం



ర్యాలీగా వస్తున్న పీఠాధిపతులు

కంచికచర్ల(వీరులపాడు): మనుషుల పాపవిమోచనకే ప్రభువు ఏసుక్రీస్తు సిలువపై రక్తాన్ని చిందించారని గుంటూరు మేత్రాసన పీఠాధిపతి రెవ.భాగ్యయ్య చిన్నబత్తిని పేర్కొన్నారు. కంచికచర్ల పట్టణంలోని మేరీమాత దేవాలయ మహోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దివ్య బలిపూజా కార్యక్రమంలో శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొన్నారు. పీఠాధిపతి భాగ్యయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటి వారిపై ప్రేమతో మెలగాలని సూచించారు. సకల మానవాళి రక్షణకే ప్రభువు ఏసుక్రీస్తు తన ప్రాణాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఆలయ మహోత్సవంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ముందుగా చర్చిలో పీఠాధిపతి, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ పెరం దత్తు, ఫెరం చార్లెస్, వీరులపాడు మండల జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, సర్పంచ్ వేల్పుల సునీత, ఉప సర్పంచ్ వేమా సురేష్‌బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి అవకాశం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరేందుకు అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు జూన్ 6వ తేదీ లోపుగా ఐటీఐ.ఏపీ.జీవో.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసేటప్పుడు ఏవిధమైన తప్పులు లేకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులో వివరాలు సక్రమంగా లేకపోతే అడ్మిషన్ పొందుటకు అర్హత ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఇతర వివరాలకు విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్వయంగా కానీ 94906 39639, 77804 29468 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందిగామ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. ఈనెల 9వ తేదీ సాయంత్రం మండలంలోని కంచల సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై రాజమండ్రికి చెందిన రాజు, జుజ్జూరు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి ఏసుబాబు (23) ప్రయాణిస్తున్నారు. ఎదురుగా వస్తున్న మహిళను తప్పించే ప్రయత్నంలో వాహనం అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో రాజు అదే రాజు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన ఏసుబాబు అప్పటి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని సోమవారం పోలీసులు తెలిపారు.

'అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు'

భవానీపురం(విజయవాడపశ్చిమ): అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ మాజీ సీఎం చంద్రబాబునాయుడు అని వైఎస్సార్ సీపీ నేత ఆకుల శ్రీనివాస్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నాడు అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో భారీ అవినీతికి పాల్పడిన చంద్రబాబు నేడు నీతి, నిజాయతీల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు.